క్లుప్తంగా

మదర్ థెరిస్సాకు నివాళి



మదర్ థెరిస్సాకు నివాళులు అర్పిస్తున్న సహాయ ఫౌండేషన్ సభ్యులు

కామవరపుకోట: మదర్ థెరిస్సా వర్ధంతి సందర్భంగా సహాయ పౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అభాగ్యుల పాలిట మాతృమూర్తిగా వెలుగొందిన మదర్ థెరిస్సా జీవితం ఆదర్శనీయమని అన్నారు. సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు తమ్మిశెట్టి సత్యనారాయణ, టీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: మదర్ థెరిస్సా వర్ధంతి కార్యక్రమం కొయ్యలగూడెం, గవరవరం, కన్నాపురం గ్రామాలలో మంగళవారం నిర్వహించారు. పరింపూడి దళితవాడలోని మూడవ వార్డు, కన్నాపురం రోడ్డులోని మదర్ థెరిస్సా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మడుతూరి శ్రీనివాసరావు, వాసా ప్రసాద్, కె.అన్నవరం, వీరబాబు, బొబ్బర మంగరాజు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

కొయ్యలగూడెం: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయిస్ తహసీల్దార్ టి.శ్రీనివాస్ మంగళవారం పేర్కొన్నారు. పొంగుటూరుకు చెందిన యాతం కనకారావు ఇంటివద్ద పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు ఉన్నట్లు సమాచారం రావడంతో ఆకస్మిక దాడి నిర్వహించగా 20 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించినట్లు తెలిపారు. 6(ఎ) కేసు నమోదు చేశామని, మొత్తం సరుకు విలువ రూ.36 వేలు ఉంటుందన్నారు. దాడుల్లో వీఆర్వో ఏసుబాబు పాల్గొన్నారు.

పంచలోహ కవచం సంప్రోక్షణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయంలో మంగళవారం పంచమి తిథి సందర్భంగా అమ్మవారికి పంచలోహ కవచం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు, పెద్దింటి చరణ్ దీక్షితులు విశ్వక్సేన పూజ, గణపతి పూజ పుణ్యాహవచనం వాస్తు పూజ, హోమం జరిపారు. కార్యక్రమాలకు చిన్ని భాస్కర్, ఆదిలక్ష్మి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.

పశువిజ్ఞాన బడి

కుక్కునూరు: స్థానిక వనరులను ఉపయోగించుకోని ప్రతి రైతు పశుసంపద ద్వారా రెట్టింపు ఆదాయాన్ని పొందవచ్చని జీలుగుమిల్లి పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా.ఎం.సాయిబుచ్చారావు పేర్కొన్నారు. మంగళవారం కుక్కునూరు రైతుభరోసా కేంద్రంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. గొర్రెల పెంపకములో అనుసరించాల్సిన మెలకువల గురించి గొర్రెల యజమానులకు వివరించారు. ప్రభుత్వం తరుపున గొర్రెలకు ఉచితంగా అందిస్తున్న టీకాలను వేయించాలన్నారు. పశువులకు నట్టల నివారణ మందులను అందించాలన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

బుట్టాయగూడెం: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డుకున నామినేట్ అయిన దొరమామిడి గ్రామాన్ని మంగళవారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ మద్దెల రామాంజనేయులు మంగళవారం సందర్శించారు. గ్రామ సమీపంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, గ్రామంలోని పలు ఇళ్లను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. గ్రామంలోని పారిశుధ్య పనుల వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ తెల్లం రాముడు సచివాలయం ద్వారా గ్రామాల్లో చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ముప్పిడి బుజ్జమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

10 మందిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న 10 మంది ద్విచక్ర వాహనచోదకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. మంగళవారం వాహన తనిఖీల్లో భాగంగా పత్రాలు లేని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ క్రాసింగ్ తదితర నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదుచేసినట్లు ఎస్సై చెప్పారు.

నష్టపరిహారం ప్రకటించాలని ఆందోళన

చింతలపూడి: సీతానగరం ఆయిల్‌పాం అగ్రోవెట్ ఫ్యాక్టరీలో సోమవారం ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఒరిస్సాకు చెందిన సాహైల్ శెట్టి కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన జరిపారు. చింతలపూడి మార్చురీ వద్ద మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండా అడ్డుకున్నారు. మృతుని కుటుంబానికి ఫ్యాక్టరీ యాజమాన్యం నష్టపరిహారం ప్రకటించేవరకు మృతదేహాన్ని కదలనీయమని భీష్మించారు. దీంతో ఎస్సై కె ప్రసాద్, అసిస్టెంట్ లేబర్ అధికారి కలిసి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియో, కాంట్రాక్టర్ నుంచి రూ.2.40 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఈఎస్ఐ పెన్షన్ లేదా వర్క్‌మెన్ కాంపన్సేషన్ కింద రూ.14.60 లక్షలు ఇవ్వడానికి అంగీకారం కుదిరిందని యూనియన్ నాయకులు తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వర్రావు పాల్గొన్నారు.

గురువులతోనే భావితరాల భవిష్యత్తుకు బాటలు



బుట్టాయగూడెం : ఉపాధ్యాయులను సన్మానించిన పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, తదితరులు



కొయ్యలగూడెం : బయ్యన్నగూడెంలో గురువులకు సత్కారం నిర్వహించిన దృశ్యం



టి.నరసాపురం : మండల పరిషత్ కార్యాలయంలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

బుట్టాయగూడెం: భావితరాల ఉత్తమ భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలరాజు మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠాలు బోధించే గురువులు సాక్షాత్తూ పరబ్రహ్మతో సమానమని అనాడే పెద్దలు చెప్పారన్నారు. ఉత్తమ సమాజాన్ని తయారుచేసేది గురువే అన్నారు. తాను చదివిన పాఠశాలలోనే మొదట ఉపాధ్యాయుడిగా పనిచేసినట్లు తెలిపారు. సర్వేపల్లి ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తనకు విద్య నేర్పిన గురువులందరికీ ఈ సందర్భంగా బాలరాజు సెల్యూట్ చేశారు. అనంతరం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమసేవలందించిన పలువురు ఉపాధ్యాయులకు మొమెంటోలు ఇచ్చి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించి గురువులకు పాదాభివందనం చేశారు.

భవిష్యత్తుకు దిక్సూచి ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం: భవిష్యత్తుకు దిక్సూచిలా ఉపాధ్యాయులు నిలుస్తారని, అటువంటి గురువులను గౌరవించడం అందరి బాధ్యత అని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఆయన జన్మదినోత్సవం రోజునే మనం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం పట్టణంతో పాటు చింతలపూడి నియోజకవర్గంలోని ఉపాధ్యాయులందరికీ ఆయన ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, ఆర్డీవో డాక్టర్ ఎం.ఝాన్సీరాణి, తహసీల్దార్ కె.స్లీవజోజి, కమిషనర్ పి.భవానీప్రసాద్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.ప్రసాద్ బాబు అధ్యక్షతన కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో టీచర్స్ డే నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ వంతగాని వెంకన్న అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 9 మంది ఉపాధ్యాయులను సత్కరించి అవార్డులు అందజేశారు.

సర్వేపల్లికి నివాళి

కుక్కునూరు: మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న కుక్కునూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ పూనెం సుశీలకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

గురువులకు సత్కారం

కొయ్యలగూడెం: బయ్యనగూడెంలో మంగళవారం బలరామ జయంతి, సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నిర్వహించారు. వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చదువు నేర్పిన గురువు రిటైర్డ్ ఎంఈఓ చేబ్రోలు సుభాష్ చంద్రబోస్, చేతివృత్తి విద్యను నేర్పిన సుంకర సత్యనారాయణ, నాట్య విద్యను నేర్పిన ముసిరెడ్డి నాని లను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో వనిత క్లబ్, వాసవి క్లబ్ మండల అధ్యక్షులు జయవరపు లక్ష్మణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన ఉపాధ్యాయులను సత్కరించారు.

పోలవరం రూరల్: స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎంపీపీ వెంకటరెడ్డిని శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఎంఈవో ఎల్‌చూడామణి పాల్గొన్నారు.

సమాజంలో గురువుల పాత్ర కీలకం

ద్వారకాతిరుమల: సమాజంలో గురువుల పాత్ర ఎంతో కీలకమైందని గుండుగొలనుకుంట సర్పంచ్ బండారు ధనలక్ష్మి అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు పి.రాంబాబు, రాజేశ్వరి, పుణ్యవతి, అనంతలక్ష్మిలను మంగళవారం ఆమె ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బండారు కాశీ, నాగ సుబ్బారావు, వెంకన్నబాబు తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

లింగపాలెం: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న ఏ వేణుగోపాలరావు దంపతులను లింగపాలెం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంఈవోలు కె రామారావు, జె రవీంద్ర, ఉపాధ్యాయులను సత్కరించారు.

ఉపాధ్యాయుల పాత్ర ప్రశంసనీయం

టి.నరసాపురం: భవిష్యత్తు తరాలను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో టీచర్లు నిర్వహిస్తున్న పాత్ర ప్రశంసనీయం అని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 9మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని పూలమాలలు వేసి దుశ్శాలువాలు, మొమెంటోలతో సత్కరించారు. గుర్వాయిగూడెంలో లయన్స్‌క్లబ్ కోశాధికారి బండ్రెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు వగ్గాల జానయ్య, మధుసూదనరావులను ఘనంగా సన్మానించారు.



కుక్కునూరు : సీనియర్ ఉపాధ్యాయులును సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు



కామవరపుకోట : సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో సహచర ఉపాధ్యాయులు



పోలవరంరూరల్: ఎంఈవో కార్యాలయంలో ఎంపీపీని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



ద్వారకాతిరుమల : గుండుగొలనుకుంటలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి



లింగపాలెం : ఉపాధ్యాయుడు వేణుగోపాలరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీవారి దేవస్థానం ఉద్యోగులకు ఉచిత వైద్యసేవలు

ద్వారకాతిరుమల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ వేగిరెడ్డి సుజేష్ అన్నారు. శ్రీవారి దేవస్థానం ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యార్థం ఏలూరు ఆయుష్ ఆస్పత్రి వారు ఉచిత వైద్యశిబిరాన్ని ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాధరావుల ఆధ్వర్యంలో స్థానిక హరిణి కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేశారు. అందులో ఆస్పత్రి ప్రముఖ వైద్యులు భానుకిరణ్, వైద్య బృందం 200 మందికి పలురకాల వైద్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆయుష్ ఆస్పత్రి వారికి ఆలయ ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ రమణరాజు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ కవిత, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఉత్తమ గోపాలకృష్ణ(బన్నీ), దుర్గాప్రసాద్, రాధా, చిన్నారి, విజయచంద్, అబ్బాస్, రామకృష్ణ, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు తోడుగా..

వెలగపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



వెలగపాడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

టి.నరసాపురం: జగనన్న ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎప్పుడూ తోడుగా అండగా ఉంటుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని వెలగపాడులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏ కుటుంబానికి ఎంతెంత సంక్షేమ లబ్ధి చేకూరిందో ఆయా కుటుంబాలకు వివరించారు. ఈ ప్రభుత్వం దళారులు లేకుండా, లంచాలకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు వివరించారు. గ్రామంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం అధికారులకు సూచనలు జారీ చేశారు.

విద్యకు పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. వెలగపాడు గ్రామంలో నాడు నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసిన ఎంపీయూపీ పాఠశాలను ఆయన సందర్శించి పిల్లలతో కొద్ది సేపు ముచ్చటించారు. ఉపాధ్యాయకులకు టీచర్స్ డేని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ విద్యారంగంలో ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులను అమలు చేస్తూ పేద పిల్లలు ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనేలా తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దామన్నారు. మౌలిక వసతుల కల్పనలోనూ ఎనలేని కృషి జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బాలరాజు వెంట జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు, మధ్యాహ్నపువారిగూడెం సహకార సంఘం చైర్మన్ దాసరి రాంబాబు, మామిళ్ల శ్రీను, ఉమ్మడి గంగరాజు, యర్రా గంగాధరరావు, బోళ్ల రంగారావు, ఉమ్మడి సాయితేజ, పోసారపు నందియ్య, బొడ్డు శ్రీను, నల్లమిల్లి డేవిడ్, కర్రి పోతురాజు, బొడ్డు పండు, తదితరులు పాల్గొన్నారు.

బాలవికాస కేంద్రాల్లో చదువు, సంస్కారం నేర్పాలి

ద్వారకాతిరుమల: బాలవికాస కేంద్రాల్లో చదువుతో పాటు విద్యార్థులకు సంస్కారం కూడా నేర్పాల్సిన బాధ్యత ఆచార్య మాతాజీలదేనని సమరసత సేవా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకారవాడల్లో నిర్మించిన దేవాలయాల వద్ద నిర్వహించే బాలవికాస కేంద్రాల ఆచార్య మాతాజీలకు శ్రీవారి కొండపైన ధర్మఅప్పారాయ నిలయంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈ ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న త్రినాథ్ మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను గౌరవించే విధంగా, మన సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు నేర్పాలన్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలో 420 బాలవికాస కేంద్రాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రముఖ్ కొండా రెడ్డి, రాష్ట్ర బాలవికాస్ మహిళా కన్వీనర్ విజయలక్ష్మి, రాష్ట్ర ధర్మప్రచారకులు ముద్దు సాయిరాం తదితరులున్నారు.

అర్హులకు సంక్షేమ లబ్ధి



పోలవరంలో నూతన పింఛన్‌లను అందిస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలకు వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ లబ్ధి అందేటట్లు చేశారని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పాడుం పుష్పతో కలిసి ఆయన కొత్తగా మంజూరైన పింఛన్‌దారులకు పింఛన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పింఛన్‌ల కోసం అనేక అవస్థలు పడాల్సి వచ్చేదన్నారు. పింఛన్‌దారుల ఇబ్బందులను గమనించిన సీఎం వైఎస్ జగన్ ఇంటికే పింఛన్ పంపిణీ చేస్తుండడం అభినందనీయమన్నారు. మండలానికి కొత్తగా 152 పింఛన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.శ్రీను, మండల ఉపాధ్యక్షుడు యామల శ్రీదేవి, ఎంపీటీసీ కాశీ ధనలక్ష్మి, పంచాయతీ ఉపసర్పంచ్ కోరసిక శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పాడుం శ్యాం, పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



చింతలపూడిలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఉత్తమ సేవలందించిన 9 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఎమ్మెల్యే ఎలీజా, ఎంపీపీ డా రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్ ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సత్కరించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం డా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఎమ్మెల్యే ఎలీజా పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎలీజా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తీసుకువచ్చి రాష్ట్రపతిగా ఎదిగిన సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో రూ.35 కోట్లకు పైగా ఖర్చుచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఎస్ వరలక్ష్మి, గుత్తా కిషోర్, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు ఎ సుబ్బారావు, గ్రంధాలయ సంస్థ కన్వీనర్ ఎం.దిలీప్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.కాంతారావు, కాటూరి ఏలియ, ఎంఈఓ జి రామారావు, ఎంఈఓ -2 కిరణ్ బాబు, సాంబశివరావు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన

మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు డి.రామకృష్ణారావు, కె.బేబీ సుశీల, సీహెచ్ విమలాదేవి, ఎం.సంజీవకుమార్, ఎన్‌టీవీ ఆస్కార్, కె.ప్రభావతి, ఎన్‌సీహెచ్ థెరీసమ్మ, ఎస్‌కే ఖాజా మొహిద్దీన్, ఆర్.రామలక్ష్మిలను ఎమ్మెల్యే ఎలీజా అభినందించారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన



దివ్యాంగ బాలుడికి నూతన పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా, చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సంక్షేమ పాలన ప్రారంభమైందని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ భేదాలు లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందేలా చేస్తున్నారన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో ఆగస్టు నెలలో వివిధరకాల పింఛన్‌లు 4,754 అందజేసినట్లు తెలిపారు. 164 పింఛన్‌లు కొత్తవికాగా, మరో 226 పింఛన్‌లు పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. అవి కూడా త్వరలో అందిస్తామన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే నూతనంగా నియమించబడిన వలంటీర్‌లకు నియామకపత్రాలు అందజేశారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు, ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి, తహసీల్దార్ కె.స్లీవజోజి, కమిషనర్ పి.భవానీప్రసాద్ పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు 50 డెస్కుల వితరణ

ఏలూరు రూరల్: ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలకు కాశీపట్నం ఫౌండేషన్ ట్రస్టీ ఇందు శేఖరరావు రూ.6 లక్షల విలువైన వస్తువులు బహూకరించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రూ.5 లక్షల విలువ గల 50 డ్యూయల్ డెస్కులు, రూ.లక్ష విలువైన 800 స్టీల్ కంచాలు పాఠశాల హెచ్ఎం జి.సునీతకు అందజేశారు. గతంలో సైతం దాత పాఠశాల క్రీడాకారిణిలకు రూ.32 వేల విలువ కల్గిన బూట్లు అందజేశారు. ఈ సందర్భంగా శేఖరరావుకు శాలువా కప్పి సత్కరించారు. రిటైర్డ్ హెచ్ఎం జల్లా వీరభద్రరావు, ట్రస్ట్ సమన్వయకర్త శంకర వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

నూతన పింఛన్‌ల పంపిణీ



పింఛన్ కార్డులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కొయ్యలగూడెం: కొత్తగా మంజూరైన పింఛన్ కార్డులను పింఛన్‌దారులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మిల లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. మండలంలో కొత్తగా 240 కార్డులు మంజూరుకాగా ఇందులో 89 వృద్ధాప్య, 45 వికలాంగులు, ఒంటరి మహిళ, కల్లుగీత కార్మికునికి ఒకొక్కటి చొప్పున, 104 మందికి వితంతువులకు పింఛన్లు మంజూరు అయ్యాయని అన్నారు. మరో 430 మంది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని ఎంపీడీవో పేర్కొన్నారు.

పింఛన్ అందజేత



గన్నవరంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

లింగపాలెం: కె.గోకవరం గ్రామానికి చెందిన వృద్ధురాలు సుగంధం ధర్మం గుంటూరు ప్రభుత్వ హస్పటల్‌లో క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతోంది. మంగళవారం వలంటీర్ అశోక్ కుమార్ రూ ఆమెకు గుంటూరు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. అలాగే ఆశన్నగూడెం గ్రామానికి చెందిన పి దామోదరావు గన్నవరం పిన్నమనేని హాస్పటల్‌లో డయాలసిస్ చికిత్స పొందుతుండగా వలంటీర్ రాటాలు గన్నవరం వెళ్లి పింఛన్ అందజేశారు. వలంటీర్లను గ్రామస్తులు అభినందించారు.